

హుండీ కానుకల లెక్కింపు
కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన హుండీ కానుకలను బుధవారం ఆలయ అధికారులు పకడ్బందీగా లెక్కించారు. - 8లో



ఎన్‌సీసీ కేడెట్లకు ఉజ్వల భవిత
ఎన్‌సీసీ శిక్షణ పొందిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా ఎస్పీ మణికంఠ అన్నారు. - 8లో



సింహ వాహనంపై శ్రీనివాసుడు
అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి సింహ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. - 8లో

న్యూస్‌రీల్

1 నుంచి టీచర్లకు శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో జూలై 1వ తేదీ నుంచి టీచ్ క్లాస్ అబ్జర్వర్స్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ దేవరాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో జూలై 1 వ తేదీ నుంచి 10 వ తేదీ వరకు శిక్షణా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఇందుకు 514 ట్రైనీలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ శిక్షణను ఉన్నతాధికారులు ఆదేశించిన నియమ, నిబంధనల ప్రకారం నిర్వహిస్తామని డీఈఓ తెలిపారు.

సీజనల్ వ్యాధులను నియంత్రించండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ కీటక జనిత వ్యాధుల నియంత్రణపై పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. మలేరియా, డెంగీ నివారణకు పారిశుద్ధ్య కల్పన, క్లోరినేషన్, స్ప్రేయింగ్, ఫాగింగ్ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీ, మున్సిపాలిటీ అధికారులు, వైద్యశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలోని సంక్షేమ శాఖల వసతి గృహాల్లో ఫాగింగ్ చేయించాలని ఆదేశించారు. నీరు నిల్వ ఉండే గుంతల్లో ఆయిల్‌బాల్స్ వేయించాలని తెలిపారు. మురుగునీరు ఎక్కువగా నిలువ ఉండే పెద్దగుంతల్లో గంబూజియా చేప పిల్లలను వదలాలని కలెక్టర్ ఆదేశించారు.

తిరువణ్ణామలైకి 150 బస్సులు



సత్యవేడు గ్యారేజ్‌లో బస్సులు పరిశీలిస్తున్న ఆర్‌ఎం చెంగల్‌రెడ్డి

సత్యవేడు: తమిళనాడులోని తిరువణ్ణామలైకి పౌర్ణమి సందర్భంగా 150 బస్సులు నడుపుతున్నట్లు ఆర్‌ఎం చెంగల్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన సత్యవేడు డిపోను పరిశీలించారు. బస్సుల కండిషన్‌ను అడిగి తెలుసుకున్నారు. సత్యవేడు డిపో ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఆదాయంలో తిరుపతి డిపో ప్రథమ స్థానంలో ఉండగా సత్యవేడు డిపో ఏడో స్థానంలో ఉందని వెల్లడించారు. జిల్లాకు కొత్తగా 42 బస్సులు రానున్నట్లు చెప్పారు. సత్యవేడు డిపోకు కూడా కొత్త బస్సులు కేటాయిస్తామన్నారు. ప్రస్తుతం నూతనంగా ఆరుగురు కండక్టర్లను నియమించినట్లు తెలిపారు. మండల కేంద్రాల్లో ఆర్టీసీ పార్శిల్ సర్వీసుల కేంద్రం నిర్వహిస్తున్న వారికి 15 శాతం కమీషన్ ఇస్తున్నట్లు వివరించారు. కొత్తగా లైసెన్సు కావాల్సిన వారు రూ. 3 వేలు చెల్లించాల్సి ఉందని వెల్లడించారు. నాగలాపురం బస్టాండుకు ప్రహరీ గోడ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎం రమణ, ఏఎఫ్‌ఎం శ్రీనివాసులు, ఎల్‌హెచ్ జోహార్ పాల్గొన్నారు.

వెంటాడి.. వేటాడి



ఎస్ఆర్ పురం మండలానికి చెందిన తులసీరామ్ (రాజు)పై దాడి చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

- వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యంగా కూటమి నేతల అరాచకాలు
- కాపు కాసి రాడ్లు, కర్రలతో ముకుమ్మడిగా దాడులు
- రెండు వారాల్లో 75 మందిని తీవ్రంగా గాయపరచిన పచ్చమూకలు
- ఊరొదిలి వెళ్లిపోవాలంటూ బెదిరింపులు
- కౌంటింగ్ రోజు నుంచి పేట్రేగిపోతున్న టీడీపీ గూండాలు

ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఉంటారని అనుమానం వస్తే చాలు.. అంతు చూస్తున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త కనిపిస్తే చాలు.. చితకబాదుతున్నారు. అధికారంలోకి రాగానే కళ్లు నెత్తికెక్కిన కూటమి నేతలు పేట్రేగిపోతున్నారు. ప్రత్యర్థి పార్టీ శ్రేణులను వెంటాడి.. వేటాడుతున్నారు. దొరికినవారిని దొరికినట్టు చావగొట్టేస్తున్నారు. మారణాయుధాలతో రెచ్చిపోయి మరీ దాడులు చేస్తున్నారు. ఇళ్లలోకి దూరి విధ్వంసం సృష్టిస్తున్నారు. చేతులెత్తి దండం పెట్టినా కనికరం లేకుండా తరిమి తరిమి కొడుతున్నారు. ప్రాణాలు దక్కాలంటే ఊరొదిలి వెళ్లిపోవాలని హుకుం జారీ చేస్తున్నారు. పోలీసుల సమక్షంలోనే అరాచకాలకు తెగబడుతున్నారు.

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యంగా కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. నివాసాలకు వెళ్లి మరీ దాడులకు తెగబడుతున్నారు. మరి కొందరికి ఫోన్లు చేసి బెదిరించి ఊరు నుంచి పారిపోయేలా వ్యవహరిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసుల సమక్షంలోనే దాడులు చేస్తున్నా పట్టించుకోకపోవటమే ఇందుకు నిదర్శనమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ముగిసిన రోజు నుంచి కూటమి శ్రేణులు చెలరేగిపోతున్నాయి. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, సానుభూతిపరులను వెంటాడి కర్రలు, రాడ్లు, రాళ్లతో దాడులు చేస్తున్నారు. చేతులెత్తి దండంపెడుతున్నా విడిచిపెట్టకుండా కుళ్లబొడుస్తున్నారు. బుధవారం చిత్తూరులో వెలుగుచూసిన ఓ వీడియోనే ఇందుకు నిదర్శనం. వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాజును కూటమి పార్టీలకు చెందిన కార్యకర్తలు కిడ్నాప్ చేశారు. జన సంచారంలేని ప్రాంతానికి రాజుని తీసుకెళ్లి మోకాళ్లపై కూర్చోబెట్టి రాడ్లు, కర్రలతో మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటనను వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇలా ఒక్క రాజుపైనే కాదు.. ఈ రెండు వారాల్లోనే ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 75 మంది వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. మరో వైపు ఫ్యాను గుర్తుకు ఓటేశామని చెప్పుకున్న వారి నివాసాలకు వెళ్లి కొందరిని, దారి కాచి మరి కొందరిపై దాడులు చేశారు. కూటమి శ్రేణుల బెదిరింపులకు అనేక మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఊరొదిలి వెళ్లిపోయారు. వారు ఎక్కడ ఉన్నారో అచూకీ తెలియక కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు. చంద్రగిరి, చిత్తూరు, కుప్పం, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, తిరుపతి, శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి నియోజక వర్గాల పరిధిలో ఇలాంటి ఘటనలు అధికంగా చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీ శ్రేణులను కొట్టి తర్వాత బెదిరించి రాజీ చేసుకుని వ్యక్తిగత గొడవలుగా చిత్రీకరించేందుకు సైతం యత్నిస్తున్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని ఎస్ఆర్ పురం మండలానికి చెందిన తులసీరామ్ (రాజు) అనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇదేవిధంగా బెదిరించి రాజీ చేసుకుని వ్యక్తిగత గొడవల్లో భాగంగా దాడులు జరిగినట్టు కేసు పెట్టడమే ఇందుకు నిదర్శనం.



పచ్చమూక దాడిలో గాయపడిన ఐతేపల్లె వార్డు సభ్యుడు సక్కూరు వంశీ (ఫైల్)



చంద్రగిరికి చెందిన సాధిక్ (ఫైల్)



చిన్నగొట్టిగల్లు వార్డు సభ్యుడు ఇర్షాద్ (ఫైల్)

అధికారులైనా తగ్గేదేలే..!

వైఎస్సార్‌సీపీ శ్రేణులే కాదు.. గ్రామస్థాయి నుంచి ఉన్నతాధికారులపైనా దాడులకు టీడీపీ రౌడీలు తెగబడుతున్నారు. ఈ క్రమంలోనే ఎస్వీ యూనివర్సిటీ వీసీ శ్రీకాంత్‌రెడ్డిపై దౌర్జన్యం చేశారు. నేరుగా ఆయన చాంబర్‌లోకే దూసుకెళ్లి బూతులు తిడుతూ.. దాడి చేసేందుకు యత్నించారు. కూటమి శ్రేణుల ఆగడాలకు భయపడి వీసీ అక్కడి నుంచి పారిపోయే దుస్థితి తీసుకువచ్చారు. అలాగే పలు గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలపైనా బెదిరింపులకు దిగుతున్నారు. ఇకపై పంచాయతీ కార్యాలయానికి రావొద్దని, సెలవు పెట్టి వెళ్లిపోవాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. తమ మాట కాదని వస్తే.. అంతు చూస్తామంటూ భయాందోళనకు గురిచేస్తున్నారు. మంత్రి అచ్చెన్నాయుడు ఇటీవల చేసిన వ్యాఖ్యలతో మరింత రెచ్చిపోతున్నారు. పలు కార్యాలయాలకు వెళ్లి బెదిరింపులకు దిగుతున్నారు. కుప్పంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్ నాలుగు రోజులుగా అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో అధికారులకు తీవ్రస్థాయిలో హెచ్చరికలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. కుప్పం టీడీపీ కార్యకర్తలు సైతం కార్యాలయాలకు వెళ్లి 'మేం పసుపు బిళ్లతో వచ్చాం. భూముల వివరాలు, మైన్స్ వివరాలు ఇవ్వాలి. లేదంటే మిమ్మల్ని బదిలీ చేయిస్తాం' అంటూ హెచ్చరించినట్లు తెలిసింది. కూటమి నేతల బెదిరింపులతో అనేక మంది అధికారులు స్వచ్ఛందంగా బదిలీలు చేయించుకుని వెళ్లిపోయేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం.

కూటమి నేతల దాడుల్లో గాయపడిన వైఎస్సార్‌సీపీ శ్రేణుల వివరాలు మచ్చుకు కొన్ని..

- చిత్తూరులో హరి, కన్నన్, రాజు,
- జీడీ నెల్లూరులో గిరి, గౌతమి, మోసెస్, మురళి, కర్ణ
- కుప్పంలో రామలింగం, 20వ వార్డు కౌన్సిలర్ మణి చిన్నన్న, 9వ వార్డు కౌన్సిలర్ గణపతి
- బైరెడ్డిపల్లెలో చంద్రశేఖర్, రామకృష్ణప్ప, లక్ష్మీపతి, సాలమ్మ, రవి, రాజేశ్వరమ్మ, భాస్కర్, మురుగేష్
- పూతలపట్టులో బాబు, జయపాల్, నిరంజన్, కిరణ్, భారతి, లోకేష్, లక్ష్మయ్య, హరి, కిరణ్ కుమార్, ఉమాపతినాయుడు, హరిబాబు, హరీష్, నవీన్‌రెడ్డి
- బంగారుపాళ్యంలో అరుణ్‌కుమార్, రాజా, హరీష్
- తవణంపల్లెలో కృష్ణమూర్తియాదవ్
- యాదమరిలో బాబు, ఆలీ, అఫ్జల్, గుల్షేర్, ఉస్మాన్, మున్నీ, కబీర్, జాకీర్, సలీమ్, గౌస్‌బాషా, శ్రీకాంత్‌రెడ్డి, నందన్న, ఈశ్వర్‌రెడ్డి
- చంద్రగిరిలో వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మస్తాన్
- పాకాల మండలం రమణయ్యగారిపల్లెలో సర్పంచ్ యువరాజు
- చంద్రగిరి మండలం కొటాలలో విరూపాక్షి హేమంత్
- చంద్రగిరి మండలం ఐతేపల్లెలో పంచాయతీ వార్డు సభ్యుడు వంశీ
- పాకాలలో సతీష్‌కుమార్
- తిరుపతి రూరల్ మండలం రామానుజపల్లె ఉప సర్పంచ్ శేఖర్
- చిన్నగొట్టిగల్లులో వార్డు సభ్యుడు ఇర్షాద్
- రామచంద్రాపురం మండలం పరమాలలో హరి
- తిరుపతి అర్బన్‌లో తిరుపతి కార్పొరేషన్ కో–ఆప్షన్ మెంబర్ రుద్రరాజు శ్రీదేవి
- తిరుపతి అర్బన్‌లో కార్పొరేటర్ తాజిన్ భర్త ఉదయ్‌వంశీ
- తిరుపతి అర్బన్‌లో వైఎస్సార్‌సీపీ 8వ డివిజన్ అధ్యక్షుడు మురళి

మాంసాహార ఉత్పత్తులతో అధిక లాభాలు



శిక్షణలో పాల్గొన్న మహిళలకు మాంసాహార ఉత్పత్తులపై శిక్షణ ఇస్తున్న వర్సిటీ అధ్యాపకులు

తిరుపతి సిటీ: మాంసాహార ఉత్పత్తుల తయారీతో మహిళలు అధిక లాభాలు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని వెటర్నరీ వర్సిటీ డీన్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య తెలిపారు. ఎస్వీ వెటర్నరీ కళాశాలలో బుధవారం జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, జాతీయ మాంస పరిశోధనా సంస్థ సంయుక్తంగా విలువ చేకూరిత మాంసాహార ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ అనే అంశంపై మహిళలకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో అధిక డిమాండు గల మంసాహార ఉత్పత్తులను తయారు చేసే విధానంపై గ్రామీణ మహిళలు దృష్టి సారించాలన్నారు. బడుగు, బలహీన వర్గాలు, రైతులు, స్వయం సహాయక సంఘాలు, నిరుద్యోగ గ్రామీణ మహిళలు ఆర్థిక ఎదుగుదలకు మాంసాహార ఉత్పత్తులు తోడ్పడతాయన్నారు. పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య మాట్లాడుతూ మాంసాహార పదార్థాల తయారీలో ఆధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగించి మహిళలు అధిక లాభాలు పొందవచ్చన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పశు ఉత్పత్తుల సాంకేతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ విజయ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ సుధీర్, డాక్టర్ ఆర్వీ సురేష్ కుమార్, డాక్టర్ తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

సర్కారు విద్యార్థులకే తల్లికి వందనం ఇవ్వండి

- ప్రైవేట్ స్కూళ్లలోని వారికి ఇస్తే వ్యాపారం చేస్తారు
- ఏపీటీఎఫ్ నేతల డిమాండ్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయబోయే తల్లికి వందనం పథకం సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకే అమలు చేయాలని ఏపీటీఎఫ్(1938) జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం నగరంలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆ సంఘ నాయకులు సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలు చేసి, ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉన్నా ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఆ పథకం అమలు చేస్తే డ్రాపౌట్స్ శాతం తగ్గుతుందన్నారు. బాలికలు మధ్యలో చదువు మానేయకుండా కొనసాగిస్తారని చెప్పారు. ఈ పథకాన్ని సర్కారు బడుల్లో చదివే పేద విద్యార్థులకు మాత్రమే అమలు చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థలకు ఈ పథకం అమలు చేస్తే వ్యాపార కేంద్రంగా మార్చేస్తారని తెలిపారు. ఇప్పటికే పలుచోట్ల ఆ పథకం పేరు చెప్పి ప్రైవేట్ యాజమాన్యాలు అడ్మిషన్లు చేసుకుంటున్నాయని ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలల్లో తల్లికి వందనం అమలైతే సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని చెప్పారు. అనంతరం ఆ సంఘం కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో ఆ సంఘ నాయకులు సమీర్, గిరిబాబు, వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ.. పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య.. విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేకంగా తెచ్చిన విద్యాహక్కు చట్టం జిల్లావ్యాప్తంగా ఎక్కడా అమలు కావడం లేదు. జిల్లాలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఈ చట్టాన్ని బేఖాతరు చేస్తున్నాయి. ఫీజులను అడ్డగోలుగా పెంచేస్తున్నా విద్యాశాఖ అధికారులు కూడా తమకెందుకులే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజుల భారం గుదిబండలా మారింది.

ఫీజుల మోత



జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల వివరాలు

జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలు	158
ప్రాథమికోన్నత పాఠశాలలు	80
ఉన్నత పాఠశాలలు	170
చదువుతున్న విద్యార్థులు	79,734
పనిచేస్తున్న టీచర్లు	3,211

- ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో అధిక ఫీజులు
- కాగితానికే పరిమితమైన జీఓ నెం.91
- నిబంధనలను భేఖాతరు చేస్తున్న యాజమాన్యాలు
- విద్యాహక్కు చట్టానికి తూట్లు
- ఫీజుల నియంత్రణపై విద్యాశాఖ అధికారుల శీతకన్ను

చిత్తూరు కలెక్టరేట్: విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఫీజుల పేరిట అడ్డగోలు దోపిడీకి తెరలేపాయి. డబ్బే ధ్యేయంగా విద్యావిలువలను తుంగలోకి తోస్తూ తల్లిదండ్రులను పీల్చి పిప్పి చేస్తున్నాయి. ఏటా ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు పెంచుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రుల జేబులు ఖాళీ అవుతున్నాయి. 2024–25 విద్యాసంవత్సరానికి జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచేశాయి. కొన్ని స్కూళ్లు ఏకంగా 25 శాతం నుంచి 50 శాతం వరకు ఫీజులు పెంచి వసూలు చేస్తున్నాయి. మొదటి టర్మ్ ఫీజులు కడితేనే బడికి రండి అంటూ విద్యార్థులకు యాజమాన్యాలు హుకుంలు జారీ చేస్తున్నాయి. ఇప్పటికే కొన్ని పాఠశాలలు మొదటి టర్మ్ ఫీజులు వసూలు చేయగా, మరికొన్ని స్కూళ్లు ఇంటర్నేషనల్, టెక్నో, ఐటీ, ఒలింపియాడ్ అంటూ చివర్లో తోక పేర్లు తగిలించుకుని ఎక్కువ ఫీజులు తీసుకుంటున్నాయి. ఫీజులతో పాటు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులు, క్యారేజీ బ్యాగులు, బూట్లు, షూలు, యూనిఫామ్, బస్సు రవాణాకు చెల్లించాల్సిన సొమ్ము అదనంగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలు 158, ప్రాథమికోన్నత పాఠశాలలు 80, ఉన్నత పాఠశాలలు 524 మొత్తం 408 ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు 79,734 మంది చదువుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లను జిల్లాలోని ఏ ఒక్క ప్రైవేటు పాఠశాలలు అమలు చేయడం లేదు. ప్రైవేటు, కార్పొరేట్ స్థాయి స్కూళ్లు బహిరంగంగానే అడ్మిషన్ ఫీజు వసూలు చేస్తున్నాయి. ఇది నిబంధనలకు విరుద్ధమే అయినా అడిగేవారు లేరు. పాఠశాల అభివృద్ధి, సిబ్బంది సంక్షేమం, క్రీడలు, పరీక్ష ఫీజు, సాంస్కృతిక కార్యక్రమాల పేరిట యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభం అయినప్పటి నుంచి ఇంతవరకు అధికారుల ఆధ్వర్యంలోని ప్రత్యేక కమిటీ కూర్చుని చర్చించకపోవడం గమనార్హం. ఇక ప్రైవేటు స్కూళ్లలో తప్పనిసరిగా డీఈడీ, బీఈడీ ఆపై చదువులు చదివిన వారినే ఉపాధ్యాయులుగా నియమించాల్సి ఉంది. అయితే ఈ నిబంధనలు ప్రైవేట్ యాజమాన్యాలు అమలు చేయడం లేదు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా మరుగుదొడ్లు, మూత్రశాలలు అధ్వానంగా ఉన్నాయి.

జీఓ 91 కాగితంపైనే..!

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించేందుకు ప్రభుత్వం జీఓ 91ని జారీ చేసి ఏళ్లు గడుస్తున్నా జిల్లాలో మాత్రం నియంత్రణ కొరవడింది. గతేడాదితో పోలిస్తే ఫీజులను 20 నుంచి 30 శాతం పెంచేశారు. జిల్లాలోని ప్రైవేటు స్కూళ్లలో 79,734 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం జీఓ 91ను అమలు చేసింది. ఆ జీఓ ప్రకారం గ్రామీణ, పట్టణ ప్రాంతాలను వేరు చేస్తూ నిర్దేశించిన ఫీజులను మాత్రమే వసూలు చేయాలి. కానీ ఈ ఫీజులను జిల్లాలోని ఏ ప్రైవేట్ యాజమాన్యం కూడా పట్టించుకోవడం లేదు.

తనిఖీలు ఎక్కడ సారూ..!

జిల్లావ్యాప్తంగా అధిక ఫీజులను కట్టడి చేసేందుకు విద్యాసంవత్సరం ప్రారంభంలో విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేయాల్సి ఉంది. ఆ సమయంలో సంబంధిత ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలు అమలు చేస్తున్నారా? లేదా ? అని నిశితంగా పరిశీలించాల్సి ఉంటుంది. అయితే జిల్లాలోని విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేయకుండా మిన్నకుంటున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ బడుల్లో అధిక ఫీజుల దోపిడీ జరుగుతోందని తెలిసినప్పటికీ ఏమాత్రం తెలియనట్టు వ్యవహరిస్తున్నారు. అధిక ఫీజులను కట్టడి చేసేందుకు కలెక్టర్ ప్రత్యేక కమిటీలను వేసి తనిఖీలు చేయించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

చర్యలు తప్పవు..

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అధికంగా ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవు. ప్రభుత్వ నిబంధనలను అన్ని యాజమాన్యాలు తప్పనిసరిగా పాటించాల్సిందే. ఫీజుల వివరాలను తల్లిదండ్రులకు తెలిసేలా నోటీసు బోర్డుల్లో పెట్టాలి. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ధరలకు పుస్తకాలు, ఇతరత్రా విద్యాసామగ్రి అమ్మకాలు చేస్తే సంబంధిత స్కూళ్లను సీజ్ చేస్తాం.

– దేవరాజు, డీఈఓ, చిత్తూరు జిల్లా

అట్టహాసంగా బడికిపోదాం



మాట్లాడుతున్న డీఈఓ దేవరాజు

పూతలపట్టు: బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు తెలిపారు. మండలంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం బడికిపోదాం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 ఏళ్లు పైబడిన పిల్లలు బడిలో ఉండకుండా పనిలో ఉంటే అటువంటి వారిని గుర్తించి వారిని బడిలో చేర్పించాలని సిబ్బందికి సూచించారు. పనికి పంపిస్తున్న తల్లిదండ్రులను హెచ్చరించడం.. వినకపోతే స్థానిక మహిళా పోలీసుకు సమాచారం తెలియజేయాలని తెలిపారు. గ్రామీణ తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను బడిలో చేర్పించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 మధుసూదనరెడ్డి, సీడీపీఓ నిర్మల పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను గుర్తించండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా బడి బయట పిల్లలను గుర్తించాలని జిల్లా సమగ్రశిక్ష శాఖ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలంతా స్కూళ్లలోనే ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. బడి బయట పిల్లలను గుర్తించి వయసుకు తగిన తరగతుల్లో చేర్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేను బడికి పోతా కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎంఈఓలు, హెచ్‌ఎంలు ప్రత్యేక దృష్టి సారించి గ్రామస్థాయిలో స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాలని చెప్పారు.

క్లుప్తంగా

డెంగీ కేసు నమోదు



ఇంటి ఆవరణలో నీటిని తొలగిస్తున్న వైద్యసిబ్బంది

ఐరాల: మండలంలోని పేరయ్యగారిపల్లెలో ఒక డెంగీ కేసు నమోదైనట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఆధ్వర్యంలో వైద్యబృందం, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు ఆ గ్రామంలో పర్యటించారు. గ్రామంలో యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించి ఇందులో భాగంగా దోమల నివారణకు మలాథిన్ మందు పిచికారీ చేయించారు. నీటి నిల్వలు ఉన్న టైర్లు, పూలకుండీల్లో నీటిని తొలగించారు. డెంగీ కేసు నమోదైన వ్యక్తి చుట్టు పక్క ఇళ్లలో ఫీవర్‌కేసు సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోము కాటు వల్ల డెంగీ, మలేరియా లాంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. డెంగీ వ్యాధి సోకిన వ్యక్తి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, సూపర్‌వైజర్ చిన్నమ్మ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.70 కోట్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1,70,18,522 వచ్చింది. ఆలయంలో గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద బుధవారం హుండీలోని కానుకలను లెక్కించారు. ప్రధాన హుండీలతోపాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 88 గ్రాములు, వెండి 579.400 కిలోలు, విదేశీ కరెన్సీ 108 నోట్లు వచ్చాయి. 25 రోజులకు ఈ ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు.

నైరుతి రుతుపవనాలతో జిల్లాలో పలుచోట్ల విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షంతో పాటు అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వీటి నివారణకు జూన్ 18 నుంచి జూలై 30 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ట్యాంకులను శుభ్రం చేయనున్నారు. ఈ మేరకు పంచాయతీలకు ఆదేశాలు అందాయి. పల్లె ప్రజలకు స్వచ్ఛమైన రక్షిత నీటిని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



వసంతాపురం పంచాయతీలో నీటి ట్యాంకు శుభ్రం చేస్తున్న కార్మికుడు (ఫైల్)

వ్యాధుల కాలం.. జరభద్రం

- జూలై 30 వరకు ఓహెచ్‌ఎస్‌ఆర్, జీఎస్ఎల్‌ఆర్ శుభ్రం చేసేందుకు స్పెషల్‌డ్రైవ్
- జిల్లాలోని 697 గ్రామ పంచాయతీల్లో ఆరోగ్యశాఖ చర్యలు
- పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: ముందస్తు వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో నీరు కలుషితం కాకుండా అవసరమైన పనులు చేపడుతున్నారు. ముఖ్యంగా మంచినీటి ట్యాంకులను శుభ్రం చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించి స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నారు. మే నెలలో అకాల వర్షాలు కురవడం, ఈ నెలలో నైరుతి రుతుపవనాల రాకతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్ (ఓహెచ్‌ఎస్ఆర్), గ్రౌండ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్ (జీఎల్‌ఎస్‌ఆర్)లకు నీటిని సరఫరా చేసే మంచి నీటిపైపులు లీక్ కావడంతో నీరు కలుషితమవుతోంది. లీక్ అయిన పైపులను సకాలంలో గుర్తించకపోవడం, వాటి నుంచి సరఫరా అయ్యే నీటినే తాగడం వల్ల ప్రజలు వాంతులు, విరేచనాలతో అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉంది.

ట్యాంకుల శుభ్రం ..

జిల్లా యంత్రాంగం సీరియస్‌గా తీసుకుని రక్షిత మంచినీటిని అందించేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. జిల్లాలోని ఏ గ్రామంలో కూడా కలుషిత నీరు తాగి ప్రజలు రోగాల బారిన పడకుండా చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఉన్న ఓహెచ్‌ఎస్ఆర్, జీఎస్ఎల్ఆర్ జూలై 30వ తేదీ వరకు శుభ్రం చేసేందుకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఎంపీడీఓ, డీఎల్పీఓ, ఈఓఆర్‌డీలకు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని 697 గ్రామ పంచాయతీల్లో ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికార యంత్రాంగం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సర్క్యులర్ జారీ చేసింది.

జిల్లాలో నీటి ట్యాంకుల వివరాలు..	
గ్రామ పంచాయతీలు	697
ఓహెచ్ఆర్ ట్యాంకులు	2,886
ఓఎస్ఎల్ఆర్ ట్యాంకులు	699
సిస్టర్న్‌లు	1500

ఏమి చేయాలి..!

- ప్రతి 15 రోజులకు ఒకసారి కచ్చితంగా ఓహెచ్ఎస్ఆర్, జీఎల్ఎస్ఆర్‌లను శుభ్రం చేయాలి. అలాగే ఆయా ట్యాంకుల వద్ద శుభ్రం చేసే తేదీని తెలియజేయాల్సి ఉంది.
- ఎన్ఐఎస్ గైడ్‌లైన్స్ ప్రకారం 20 లీటర్ల నీటి 0.50 ఎంజీ క్లోరిన్ ట్యాబెట్ కలపాల్సి ఉంది. గ్రామ పంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్, లిక్విడ్ క్లోరిన్ స్టాక్ ఉంచుకోవాలి. నీరు కలుషితం కాకుండా పరిశుభ్రంగా ఉండాలి.
- అనుమానం వచ్చిన నీటిని తాగకుండా ప్రజలకు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు ఆ నీటిని టెస్టింగ్ కోసం ల్యాబ్‌కు పంపాల్సి ఉంది.
- ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, నీరు కలుషితం అవుతుంటే సంబంధిత సోర్స్‌ను క్లోజ్ చేయాలి. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న గ్రామీణ నీటి సరఫరాకు చెందిన ఇంజినీర్లు తమ పరిధిలోని నీటి పథకాలను తనిఖీ చేస్తూ, అవసరమైన చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా తాగునీటికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

> **శుభ్రం చేయాలి..**
> పల్లెల్లో ట్యాంకర్లను సిబ్బంది శుభ్రం చేయాలి. దీనికి సంబంధించి ఆదేశాలు జారీ చేశాం. వీటితో పాటు పారిశుద్ధ్యం పాటించాలి. అందరికీ రక్షిత మంచినీటిని అందించాలి. ఇందుకు సంబంధించిన చర్యలు చేపడుతున్నారు. స్పెషల్ డ్రైవ్‌లో నీటి ట్యాంకులను జూలై 30 వరకు శుభ్రం చేయించేందుకు నిర్వహిస్తున్నాం.
> – లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి

ఎన్‌సీసీ కేడెట్లకు ఉజ్వల భవిత



ఎన్‌సీసీ కేడెట్లను అభినందిస్తున్న ఎస్పీ మణికంఠ

- ఎస్పీ మణికంఠ

చిత్తూరు కలెక్టరేట్/చిత్తూరు అర్బన్: ఎన్‌సీసీ శిక్షణతో విద్యార్థులకు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, సమైఖ్యత, మనోధైర్యం, దేశభక్తి లభిస్తుందని ఎస్పీ మణికంఠ అన్నారు. జిల్లాకేంద్రంలోని పోలీసు శిక్షణా కేంద్రంలో నిర్వహిస్తున్న కంబైన్డ్ ఎన్యూవల్ ట్రెనింగ్ క్యాంపు–1కు బుధవారం ఎస్పీ మణికంఠ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొని విధులు నిబద్ధతతో నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే దేశభక్తితో పాటు క్రమశిక్షణ, సమైఖ్యత కలిగేలా ఎన్‌సీసీ అధికారులు శిక్షణ ఇస్తున్నారని, ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచే కేడెట్లకు ఉజ్వల భవిత ఉంటుందని తెలిపారు. శిక్షణ పొందే కేడెట్లు త్రివిధ దళాలు, పారా మిలిటరీతో పాటు పోలీసు శాఖకు సంబంధించిన ఉద్యోగాల్లో కొలువులు సంపాదించడం సులువుగా మారుతుందన్నారు. క్యాంపు కమాండెంట్ కల్నల్ వివేక్ మానిష్ మాట్లాడుతూ శిక్షణలో పాల్గొన్న కేడెట్లు వివిధ పోటీల్లో అత్యున్నత ప్రతిభ చాటారన్నారు. ధల సైనిక్ శిక్షణ ఎంపికల్లో పాల్గొన్న కేడెట్లకు ఫైరింగ్, మ్యాప్‌రీడింగ్, అబ్‌సైకిల్, టెంట్ ఫిచింగ్, డ్రిల్ వంటి శిక్షణ నిర్వహించామని, వీరిలో ఎంపికైన కేడెట్లు ఈనెల ఆఖరిలో తిరుపతి జిల్లాలో జరిగే ఉమ్మడి ఎన్యూవల్ శిక్షణ క్యాంప్–2లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఎన్నికల విధుల్లో పాల్గొన కేడెట్లకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ మేజర్ లోకనాథం, అధికారులు ప్రసాద్‌రెడ్డి, రమేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన హుండీని బుధవారం ఆలయ అధికారులు పకడ్బందీగా లెక్కించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన లెక్కింపు సాయంత్రం వరకు కొనసాగింది. 20రోజులకు గానూ హుండీ నగదు రూ.1,52,94,363 వచ్చింది. బంగారం 80 గ్రాములు, వెండి 3.150 కిలోలు వచ్చాయి. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా రూ.10,376, నిత్యాన్నదానం హుండీ నుంచి రూ.27,217 భక్తులు కానుక రూపంలో సమర్పించుకున్నారు. యూఎస్ డాలర్స్ 904, ఆస్ట్రేలియా డాలర్స్ 50, సింగపూర్ డాలర్స్ 25, మలేషియా రింగిట్ 2 దాకా వచ్చాయని ఆలయ ఈఓ వెంకటేశు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు రవీంద్రబాబు, కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, ధనంజయ్య, సిబ్బంది కోదండపాణి, శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో సాధారణ బదిలీలు

తిరుపతి తుడా : స్విమ్స్‌లో పనిచేస్తున్న అధికారులను సాధారణ బదిలీ చేస్తూ బుధవారం స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీ పద్మావతి మెడికల్ కళాశాల డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దిలీప్ కుమార్‌ను కొనుగోలు విభాగానికి, ఆరోగ్యశ్రీ సెక్షన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎన్.ఆదికృష్ణయ్యను ఎస్టాబ్లిష్ సెక్షన్‌కు, ఎస్టాబ్లిష్ సెక్షన్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.ప్రసన్న లక్ష్మీని ఆరోగ్య శ్రీ విభాగానికి బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే కొనుగోలు విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ వి.శశికళను శ్రీ పద్మావతి మెడికల్ కాలేజీకి బదిలీ చేశారు. డిపార్ట్‌మెంట్ హెడ్‌లు తమ సిబ్బందిని వెంటనే రిలీవ్ చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ఆగమోక్తంగా ప్రదోష నందిసేవ



స్వామి అమ్మవార్లకు హారతి సమర్పిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం రాత్రి ఆగమోక్తంగా ప్రదోషనంది సేవ నిర్వహించారు. ముందుగా ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. అనంతరం ఉత్సవర్లను ప్రదోష నందిపై కొలువుదీర్చి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.


పేదల ఇళ్లు కూల్చివేత

రేణిగుంట : స్థానిక సీబీఐడీ కాలనీలో పేదలు నిర్మించుకున్న రెండు ఇళ్లను ఎంపీడీవో విష్ణుచిరంజీవి, ఈఓపీఆర్‌డీ రత్నమ్మ తమ సిబ్బందితో కలసి బుధవారం కూల్చివేశారు. సీబీఐబీ కాలనీలోని రైల్వే క్వార్టర్స్‌కు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో తమకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని 12మంది పేదలు సుమారు 22ఏళ్ల నుంచి పోరాడుతున్నారు. దీనిపై కోర్టు కేసులను సైతం ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని కలిసి తమకు స్థలాలు కేటాయిస్తే ఇళ్లు నిర్మించుకుంటామని విన్నవించారు. ఆయన సూచన మేరకు అప్పటి రెవెన్యూ అధికారులు సమస్యను పరిష్కరించారు. దీంతో గత ఏడాది ఇళ్లు నిర్మించుకున్న పేదలు విద్యుత్ కనెక్షన్లు సైతం తీసుకున్నారు. అయితే ఇప్పుడు తమ ఇళ్లను కూల్చడం దుర్మార్గమని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ కక్షతో పేదల ఇళ్లపై ప్రతాపం చూపడమేమిటని స్థానికులు మండిపడుతున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

సింహవాహనంపై శ్రీనివాసుడు



సింహ వాహనం పైనుంచి భక్తులను కటాక్షిస్తున్న శ్రీనివాసుడు



ముత్యపుపందిరిపై విహరిస్తున్న ప్రసన్న వేంకటేశ్వరుడు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో మూడవ రోజు బుధవారం ఉదయం 8 గంటలకు సింహ వాహనంపై శ్రీవారు భక్తులకు కటాక్షించారు. తెల్లవారుజామున అర్చకులు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి విశ్వరూప దర్శనం, తోమాలసేవ, కొలువు, అర్చన, మొదటి గంట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులను స్వామివారి సర్వదర్శనానికి అనుమతించారు. సాయంత్రం 5 గంటలకు ఊంజల్ మండపంలోకి శ్రీవారిని వేంచేపు చేశారు. 5.30 నుంచి 6.30 గంటల వరకు భక్తి కీర్తనలను ఆలపిస్తుండగా శ్రీవారి ఊంజల్ సేవ నేత్రపర్వంగా సాగింది. అనంతరం స్వామివారు వాహన మండపంలోకి వేంచేపు చేశారు.

ముత్యపుపందిరిపై ప్రసన్నుడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి 8 గంటలకు స్వామివారిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ముత్యపుపందిరి వాహనంపై కొలువుదీర్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బాలబాలికల కోలాటాల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ముత్యపుపందిరిపై పరవశుడై భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు. వాహన సేవ అనంతరం స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు. ఏఈఓ రమేష్, ఆలయ సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు కల్పవృక్ష వాహనంపై స్వామివారు దర్శనమిస్తారు. సాయంత్రం 5.30 నుంచి 6.30 వరకు ఊంజల్ సేవ, రాత్రి 7 గంటల నుంచి 8 వరకు సర్వభూపాల వాహనంపై స్వామివారు విహరిస్తారు.

అ'ద్వితీయ'ంగా అడ్మిషన్లు..!

- డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్‌లో రెండు సెషన్లుగా ప్రవేశాలకు కసరత్తు
- ఈ ఏడాది నుంచే అమలుకు యూజీసీ లేఖలు
- సాధ్యాసాధ్యాలపై చర్చిస్తున్న వర్సిటీలు
- చక్కటి నిర్ణయమంటూ ప్రశంసలు కురిపిస్తున్న విద్యావేత్తలు



తిరుపతి సిటీ : విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేయాలనే ఉద్దేశంతో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) సరికొత్త నిర్ణయం తీసుకుంది. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్‌లో ప్రవేశాలను ఏడాదికి రెండుసార్లు చేపట్టాలని సంకల్పించింది. ఈ మేరకు సంసిద్ధత తెలపాలని ఇప్పటికే పలు విశ్వవిద్యాలయాలకు లేఖలు రాసింది. దీంతో వర్సిటీ అధికారులు సాధ్యాసాధ్యాలపై చర్చలు సాగిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో ఏడాదికి రెండు సెషన్లలో ప్రవేశాలు చేపడుతున్నారు. వారి విద్యావ్యవస్థ సైతం విజయవంతంగా నడుస్తుండడంతో మనదేశంలో సైతం ఇదే తరహాలో అడ్మిషన్ల ప్రక్రియ నిర్వర్తించాలని యూజీసీ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

విద్యార్థులకు కలసి వచ్చే అంశమే..

రెండు సెషన్ల అడ్మిషన్ల ప్రక్రియ విద్యార్థులకు కలసి వచ్చే అంశమే. మొదటి సెషన్‌లో సీటు దొరకకుంటే, రెండో సెషన్‌లో ప్రవేశం పొందవచ్చు. దీంతో విద్యా సంవత్సరం నష్టపోకుండా విద్యార్థులు డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్‌లో చేరవచ్చు. ప్రస్తుతం అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. కానీ, చాలా మంది అడ్మిషన్లు పొందలేక పోతున్నారు. కొన్ని విద్యాసంస్థలు పరీక్ష ఫలితాలను సకాలంలో విడుదల చేయలేకపోవడం, ఫెయిలైన విద్యార్థులు మళ్లీ ఇన్‌స్టెంట్ పరీక్షలు రాయడంతో సకాలంలో అడ్మిషన్లు పొందలేని పరిస్థితి. వీరందరికీ రెండో సెషన్ ప్రవేశాల ప్రక్రియ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. విద్యావేత్తలు, అధికారులు సైతం యూజీసీ నిర్ణయాన్ని సమర్థిస్తున్నారు. ఈ ప్రక్రియ అమలైతే జిల్లాలో ఏటా సుమారు 5వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. ఏడాది నష్టపోకుండా విద్యను అభ్యసించే అవకాశం దక్కనుంది.

తర్జన భర్జనలో విద్యాసంస్థలు

ఏటా రెండు సార్లు ప్రవేశాల చేపట్టే విధానంపై వర్సిటీలు తర్జన భర్జన పడుతున్నాయి. ఎస్వీయూ, మహిళా వర్సిటీ, వేదిక్, జాతీయ సంస్కృత వర్సిటీలో రెండు సెషన్లలో అడ్మిషన్లు చేపట్టే సదుపాయాలు ఉంది. అయితే బోధన సిబ్బంది కొరత, సీట్ల కేటాయింపు, హాస్టల్ వసతి, పరీక్షల విధి విధానాలపై మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. ఏడాదికి రెండు బ్యాచ్‌లకు ఒకే అధ్యాపకుడు బోధించడం ఎలా సాధ్యమనే వాదన వినిపిస్తోంది. మొదటి సెషన్ అడ్మిషన్లు పూర్తి చేసి సెప్టెంబర్‌లో తరగతులు ప్రారంభించి జనవరి, ఫిబ్రవరిలో మొదటి సెమిస్టర్ పరీక్షలు పూర్తి చేయాల్సి ఉంటుంది. రెండో సెషన్ అడ్మిషన్లు జనవరిలో చేపట్టే నాటికి మొదటి సెషన్‌లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు మొదటి సెమిస్టర్ పూర్తవుతుంది. మరి రెండో సెషన్‌లో అడ్మిషన్లు పొందిన విద్యార్థుల పరిస్థితి ఏమిటనే వాదన సైతం సర్వత్రా ఉంది.

రెండు విడతలుగా..

ప్రస్తుతం ఏడాదిలో ఒకే సారి జూలై– ఆగస్టులో యూనివర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లోనూ అడ్మిషన్ల ప్రక్రియ సాగుతోంది. అయితే విద్యార్థుల సౌకర్యార్థం ఈ విద్యాసంవత్సరం నుంచే జనవరి–ఫిబ్రవరి క్యాలెండర్ ఇయర్ ప్రారంభంలో సైతం డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లు చేపట్టాలని యూజీసీ సన్నాహాలు చేస్తోంది. దీంతో జూలైలో అడ్మిషన్లు పొందలేని విద్యార్థులు తిరిగి జనవరి–ఫిబ్రవరిలో చేపట్టే రెండవ సెషన్‌లో ప్రవేశాలు పొందేందుకు వీలుంటుంది.

హాజరు శాతం పెరిగే అవకాశం



ఏడాదికి రెండు సార్లు అడ్మిషన్ల ప్రక్రియ అమలు చేస్తే విద్యార్థుల హాజరు శాతం పెరిగే అవకాశముంది. డ్రాపవుట్స్ గణనీయంగా తగ్గుతాయి. మహిళలు ఉన్నత విద్యకు మరింత దగ్గరవుతారు. వనరుల సమీకరణ, విధివిధానాలపై పూర్తి స్థాయి అధ్యయనం చేయాలి. యూజీసీ, ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు నిర్ణయాలు తీసుకుంటాం.
– భారతి, వీసీ, పద్మావతి మహిళా వర్సిటీ

మార్గదర్శకాలు రావాల్సి ఉంది



రెండు సెషన్లలో అడ్మిషన్లు చేపట్టే ప్రక్రియ విదేశాల్లో అమలు చేస్తున్నారు. దీనిపై యూజీసీ నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. వచ్చిన వెంటనే ఈ విషయంపై నిర్ణయాలు తీసుకుంటాం. బోర్డు దృష్టి తీసుకెళ్లి విధివిధానాలు, సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తాం. విదేశీ విద్యావిధానం అమలుతో పాటు గ్రాస్ ఎన్‌రోల్ మెంట్ పెరుగుతుంది.
– జీఎస్ఆర్ కృష్ణమూర్తి, వీసీ, జాతీయ సంస్కృత వర్సిటీ

విద్యార్థులకు ప్రయోజనకరం



పలు కారణాల వల్ల జూలైలో అడ్మిషన్ పొందలేని విద్యార్థులు జనవరిలో జరిగే రెండో సెషన్‌లో అడ్మిషన్ పొందే అవకాశం లభిస్తుంది. ఇది విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరం. పక్కదోవ పట్టకుండా సాఫీగా తమ ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం ఉంటుంది. దీంతో అకడమిక్ ఇయర్ నష్టపోరు. అభివృద్ధి చెందిన దేశాలలో ఈ విధానం విజయవంతంగా కొనసాగుతోంది. జిల్లాలో విద్యావంతుల శాతం పెరిగే అవకాశం ఉంది. –వి శ్రీకాంత్‌రెడ్డి, వీసీ, ఎస్వీ యూనివర్సిటీ

సాక్షి క్లాసిఫైడ్స్

Education

ONE/TWO SITTING
■ ఒకే సం॥లో Inter, Degree, B.Com, BCA, BBA, BBM, B.Sc, Diploma, B.Tech, EEE, ECS, Civil, MAC (All Branches), B.Ed, Nursing Aarya Online Degree College, TPT ✆ 9393622612

DIRECT FINAL YEAR
■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర॥ ✆ 99516 88858

BUSINESS SERVICE

BUSINESS OFFER
■ ICF కార్పొరేషన్ అగ్రికల్చర్, బిజినెస్ పర్సనల్, ఎడ్యుకేషన్, ప్రాపర్టీ పైన అమౌంట్ ఇవ్వబడును. ఏజెంట్స్&DMA కావలెను. జీతం+కమీషన్. సంప్ర: 8295642391

Wanted

■ తిరుపతిలోని ప్రముఖ లాడ్జిలో పనిచేయుటకు మేనేజర్స్ కావలెను. సంప్రదించండి: 0877 - 22307035, 9866622978.

■ వాంటెడ్ టీచర్స్. తిరుపతి రైల్వే కాలనీలోని మాతృశ్రీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పనిచేయుటకు మ్యాథ్స్, సైన్స్, సోషియల్, ఇంగ్లీష్ టీచర్స్, ఆయాలు, సెక్యూరిటీ కావలెను. ✆ 7382288751

■ Wanted Teachers for U.K.G, 1 to V Classes & Telugu Teacher for Higher Classes. Cell: 9398081895, Mangalam, Tirupati

■ విశాల్ మెగా మార్ట్‌లో పని చేయుటకు బాయ్స్, గర్ల్స్ కావలెను. అర్హత : 10th, Inter,ITI. Salary: 12000. Opp.HP Petrol Bunk, SKHT Road, Naidupeta సంప్ర:9182840406,9494160987.

■ ప్రముఖ లాడ్జిలో పనిచేయుటకు యువకులు కావలెను. రూం బాయ్స్, హౌస్ కీపింగ్ బాయ్స్, స్కావెంజర్స్, ఆసక్తి గల అభ్యర్థులు ఇప్పుడే సం.ప్ర: 8886153492, 9515130414.

■ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీలో MBBS, Engineering అడ్మిషన్ల కొరకు PRO'S కావలెను. కమీషన్, జీతం ఇవ్వబడును. సం.ప్ర: 78931 76717.

■ తిరుపతిలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. డ్యూటీ: 8 గం॥లు, 12 గం॥లు, జీతం: 9000–12000 సంప్ర: 8125223207

■ తిరుపతి నందు ప్రముఖ ట్రావెల్స్ కాంపెనీలకు పనిచేయుటకు అనుభవం గల, హెవీ లైసెన్స్ కలిగిన డ్రైవర్స్ కావలెను ✆ 9494367661, 9347237776

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రం హోం వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం 15-20 వేలు. కాల్/ వాట్సప్ చేయగలరు. సంప్ర. సెల్ : 95026 15217

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం జీ:18K. ఫోన్: 9840258899/9840488899

■ కన్సల్టెన్సీ కాదుVP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవ డానికి స్త్రీలు/పురుషులు, ఆయా,నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000.ఫ్రీరూం+భోజనం.Hyd.9014885406.

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనల ద్వారా వాటిని వివిధంగా పరిశీలించి ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే వివరాలకు, వారిలో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

